


కేంద్ర మంత్రులకు 'బండారు' అభినందన



కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడుతో బండారు

ప్రజాశక్తి-ఆలమూరు

ఎపి నుంచి కేంద్ర కేంద్ర కేబినెట్‌లోకి ఎన్నికైన శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడును, గుంటూరు ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్ లను కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు, మండలంలోని పెదపల్లకు చెందిన టిడిపి నేత సలాది నాగేశ్వరరావుతో కలసి వెళ్లి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో నాగేశ్వరరావు ఆదివారం సాయంత్రం విలేకరులకు వివరాలు వెల్లడిం చారు. ఏపీ రాజధానిలో కాబోయే కేంద్ర మంత్రులను కలిసి శుభాకాంక్షలు తెలిపినట్లు ఆయన తెలిపారు.

బడి బస్సులపై పన్ను భారం

- విద్యార్థుల తల్లిదండ్రులకు తప్పని ఇబ్బంది
- బస్సులకు ఫిటెనెస్ తప్పనిసరి
- నిబంధనలు గాలికి వదిలిన యాజమాన్యాలు

సఖినేటిపల్లికి చెందిన కె.రెవంత్ అను విద్యార్థి బడి బస్సుకు గతంలో ఏడాది రూ.8 వేలు చెల్లించేవారు. గతేడాది నుంచి ప్రభుత్వం పాఠశాలల బస్సులకు పన్ను పెంచడంతో రూ.10 వేలు చెల్లించాల్సి వస్తోంది. ఈ కారణంగా విద్యార్థుల తల్లిదండ్రులపై భారం పడుతోంది.

ప్రజాశక్తి-రాజోలు



ప్రభుత్వం లారీలు, ట్యాక్సీలతో పాటు అనేక వాహనాలపై ఎడాపెడా వివిధ పన్నుల భారం మోపడంతో రవాణారంగం కుదేలైంది. గతేడాది నుంచి ప్రయివేటు పాఠశాలల బస్సులకూ పన్ను పెంచేసింది. దూరప్రాంతాల నుంచి పాఠశాలలు, కళాశాలలకు విద్యార్థులను తీసుకురావడానికి ఆయా యాజమాన్యాల వారు బస్సులు, వ్యాన్లు నడుపుతుంటారు. వాటిపై మూడు నెలలకు ఒకసారి పన్ను చెల్లించాల్సి ఉంటుంది. గతంలోని ఈ పన్ను విధానానికి స్వస్తి పలికి గతేడాది నుంచి సీట్ల వారీగా పన్ను వసూలుకు పచ్చజెండా ఊపింది. ఈ మేరకు పెరిగిన పన్నుల వసూలుకు రవాణా శాఖాధికారులు చర్యలు చేపడుతున్నారు. ఈనెల 12న పాఠశాలలు, కళాశాలలు ప్రారంభమౌతున్నాయి. కాస్త దూరంగా ఉన్నా. మంచి బడిలో చదివించాలని తల్లిదండ్రులు ఆరాటపడుతుంటారు. ఇంటికి దూరంగా ఉండే పాఠశాలలకు వెళ్లేందుకు బడి బస్సులకు వేలకు వేలు చెల్లిస్తారు. అవైతే తమ బిడ్డలను భద్రంగా తీసుకెళ్లి.. క్షేమంగా ఇంటికి చేరుస్తాయని విశ్వసిస్తారు. కానీ పాఠశాలల యాజమాన్యాలు నిర్వహిస్తున్న బడి బస్సులు భద్రంగానే ఉన్నాయా అన్న సందేహాలు తలెత్తుతున్నాయి

సీటుకు రూ.100 చొప్పున విధింపు

గతంలో ఏడు టన్నుల్లోపు బరువున్న పాఠశాల బస్సులకు మూడు నెలలకు రూ.725 పన్ను ఉండేది. ఏడు టన్నులు మించితే రూ.1420 వసూలు చేసేవారు. గతేడాది నుంచి బరువుతో సంబంధం లేకుండా సీటుకు రూ.100 చొప్పున విధిస్తున్నారు. ఎన్ని సీట్లుంటే అన్నింటికి మూడు నెలలకు ఒకసారి పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఈ కారణంగా వాహనాల్లో బడులు, కళాశాలలకు వచ్చే విద్యార్థుల తల్లి దండ్రులపై భారం పడుతోంది. ఇప్పటికే ఫీజుల బాదుడుతో ఉక్కిరి బిక్కిరి అవుతున్న పరిస్థితుల్లో పన్నుల పెంపు మరింత కలవర పరుస్తోంది. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలో 2,729 బడి బస్సులకు పన్ను పెంపుతో అదనంగా రూ.1.09 కోట్ల ఆదాయం వస్తున్నట్లు అంచనా.

నిబంధనలు గాలికి

జిల్లాలోని పలు విద్యా సంస్థల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. బస్సుల నిర్వహణలో నిబంధనలను పాటించడం లేదు. విద్యార్థుల నుంచి భారీగా ఫీజులు గుంజుతున్నా, ప్రయాణంలో భద్రత కల్పించడం లేదని విమర్శలు వస్తున్నాయి. బడి బస్సులు నడిపే డ్రయివర్‌కు కనీసం ఐదేళ్ల అనుభవం ఉండాలి. వయసు 60 ఏళ్ల లోపు ఉండాలి. కంటి చూపు సరిగా ఉండాలి. బస్సులో సహాయకుడు తప్పని సరిగా ఉండాలి. స్కూల్ బస్సు పసుపు రంగులో ఉండేలా చూసుకోవాలి. పిల్లలు బస్సు ఎక్కేందుకు తగిన విధంగా మెట్లు ఏర్పాటు చేసుకోవాలి. బస్సులో కిటికీలకు అద్దాలు, గ్రిల్స్ ఏర్పాటు చేయాలి. బస్సు ఇంజిన కంపార్టుమెంట్‌లో ఒక అగ్నిమాపక పరికరం, అత్యవసర ద్వారం ఉండాలి. వాహన పర్మిట్, ఎఫ్‌సీ, కాలుష్య నియంత్రణ, ఇన్సూరెన్స, డ్రయివర్ లైసెన్స పత్రాలు బస్సులో ఉంచుకోవాలి. విద్యా సంస్థ పేరు, ఫోన నెంబరు, పూర్తి చిరునామా బస్సుకు ఎడమవైపున ముందు భాగంలో రాయాలి. బస్సు తలుపులకు సురక్షిత లాకింగ్ సిస్టమ్ ఉండాలి. బస్సులో సీటింగ్ సామర్థ్యం కన్నా ఎక్కువ మందిని తీసుకెళ్లకూడదు. అయితే పలు విద్యా సంస్థల యాజమాన్యాలు ఈ నిబంధనలను పాటించడం లేదు. చాలావాటికి ఎఫ్‌సీలు, ఇన్సూరెన్, పొల్యూషన పత్రాలు ఉండవు. అనుభవం కలిగిన డ్రయివర్‌ను పెట్టుకోవడంలేదు. చాలా బస్సుల్లో సహాయకులు ఉండరు. పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించుకుని వెళుతుంటారు. చిన్నారులను బస్సులో కుక్కి తీసుకెళుతున్నా. అధికారులు స్పందించడం లేదు.

ఇవి తప్పనిసరి

ఎపి మోటారు వాహన చట్టంలోని నియమాలు పాటించాలి. విద్యా సంస్థ పేరు, మొబైల్ నంబరు, పూర్తి చిరునామా బస్సు ఎడమవైపు, ముందు భాగాన స్పష్టంగా కనిపించాలి. బస్సులో ప్రయా ణించే పిల్లల జాబితా ఉంచాలి. కచ్చితంగా ప్రథమ చికిత్స పెట్టె ఉండాలి. వాహన చోదకుడు విధుల్లో ఉన్నప్పుడు తప్పనిసరిగా ఖాకీ దుస్తులు ధరించాలి. వారికి డ్రయివింగ్ లైసెన్స్ తప్పనిసరి. వాహనం నడిపే వ్యక్తికి కంటిచూపు సక్రమంగా ఉండాలి. 60 ఏళ్ల దాటిన వారిని చోదకులుగా నియమించకూడదు. ఫిర్యాదుల పుస్తకంతోపాటు అగ్ని మాపక నియంత్రణ వ్యవస్థ, వాహన సామర్థ్య ధ్రువీకరణ పత్రం తప్పనిసరి.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

విద్యాసంస్థల బస్సుల నిర్వహణలో నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు. జిల్లాలో విద్యా సంస్థల బస్సులపై స్పెషల్ డ్రైవ్ కొనసాగుతోంది. ఇప్పటి దాకా 100 బస్సులకు పైగా ఫిట్ నెస్ పరీక్షలు నిర్వహించాం.ఇప్పటి దాకా ఎఫ్‌సీలు తీసుకోని బస్సుల జాబితా ఆధారంగా తనిఖీలు చేపడతాం. స్పెషల్ డ్రైవ్‌ను మరింత ముమ్మరం చేపడతాం. నిబంధనలకు విరుద్ధంగా బస్సులు నడిపే విద్యాసంస్థలపై చర్యలు తీసుకుంటాం.

- శ్రీనివాస్, జిల్లా ట్రాన్సపోర్ట్ అధికారి



గోపవరంలో నాయకుల విజయోత్సవ సభ

అభివృద్ధి, సంక్షేమమే కూటమి ధ్యేయం

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని మాజీ ఎంపీ ఎజెవి.బుచ్చిమహేశ్వరరావు అన్నారు. ఎంపీగా గంటి హరీష్ మాదుర్ బాలయోగి ఎంఎల్ఎగా అయితా బత్తుల ఆనందరావులు అత్యధిక మెజారిటీతో గెలుపొందిన సందర్భంగా ఆదివారం గోపవరంలో టిడిపి, జనసేన నాయకులు, గ్రామస్తులు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. బుచ్చిమహేశ్వరరావు మాట్లాడుతూ జగన్ పాలనలా కాకుండా పటిష్టమైన పాలన కూటమి అందిస్తుందని అన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి సభ్యులు, రాష్ట్ర టిడిపి వాణిజ్య విభాగం ఉపాధ్యక్షులు దేశంశెట్టి లక్ష్మీ నారాయణ, తెలుగు రైతు మండల అధ్యక్షుడు పెమ్మిరెడ్డి సత్యనారాయణ, నాయకులు ఇసుక పట్ల రఘు బాబు, అయితాబత్తుల వెంకటకష్ణారావు, చిక్కం పెద్ద బ్బులు, అయితాబత్తుల ఉమామహేశ్వరరావు, ఆకుల రాము, ఆకుల వెంకటరమణ, వాకపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ డైరీ ఆవిష్కరించిన టిడిపి నేతలు



యుటిఎఫ్ డైరీ ని ఆవిష్కరిస్తున్న మండల టిడిపి నేతలు

ప్రజాశక్తి-ఆలమూరు

ఆలమూరు టిడిపి నాయకులు, పారిశ్రామికవేత్త, శ్రీమురళీకృష్ణ సంస్థల అధినేత వంటిపల్లి పాపారావు, ఈదల సత్తిబాబు, వంటిపల్లి సతీష్, రామానుజుల శేషయ్య, ఈదల నల్లబాబు, కడియాల శ్రీను, ఈదల రాంబాబులు ఆదివారం సాయంత్రం యుటిఎఫ్ డైరీని ఆవిష్కరించారు. ముందుగా ఆలమూరు మండల యుటిఎఫ్ సభ్యులు వారిని మర్యాదపూర్వకంగా కలిసి కొత్తపేట నియోజకవర్గ కూటమి అభ్యర్థి బండారు సత్యానందరావు విజయానికి విశేష కృషి చేసి భారీ మెజార్టీని అందించి, ఘన విజయానికి కారుకులైన వారందరినీ ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఇంతటి ఘనవిజయాన్ని అందించిన ప్రభుత్వ ఉద్యోగులకు, నియోజకవర్గ టిడిపి, జనసేన, బిజెపి నాయకులకు, కార్యకర్తలకు, మహిళలకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలమూరు మండల యూటీఎఫ్ అధ్యక్షులు అద్దరి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి జొన్నాడ మనోజ్ కుమార్, యూటీఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.

మురళీకృష్ణ సంస్థ కార్మికుల విజయోత్సవాలు

ప్రజాశక్తి-ఆలమూరు

రాష్ట్రంలో ఎన్‌డిఎ కూటమి విజయంలో భాగంగా కొత్తపేట నియోజకవర్గం నుంచి కూటమి అభ్యర్థి బండారు సత్యానందరావు భారీ మెజారిటీతో సంచలన విజయం సాధించారు. ఈ సందర్భంగా మండలంలోని పెదపళ్ళ పరిధి శ్రీమురళీకృష్ణ సంస్థకు చెందిన కార్మికుల ఆధ్వర్యంలో విజయోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆ సంస్థల అధినేత, ప్రముఖ వ్యాపారవేత్త వంటిపల్లి పాపారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా మండల కేంద్రంలోని పాపారావు నివాసం నుంచి బాణసంచా కాల్చుతూ పెద్దపళ్ళ శ్రీమురళీకష్ణ రైస్ మిల్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మురళీకృష్ణ స్టాఫ్ పాపారావుకు పూలమాలల వేసి, పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా స్టాఫ్ ఏర్పాటు చేసిన భారీ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఇంతటి ఘనవిజయాన్ని అందించిన నియోజకవర్గ టిడిపి, జనసేన, బిజెపి నాయకులకు, కార్యకర్తలకు, మురళీకృష్ణ సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులకు, మహిళలకు పాపారావు కృతజ్ఞతలు తెలియజేశారు.



పాపారావుకు అభినందన సత్కారం

నిందితులను వెంటనే శిక్షించాలి

- ఎర్రపోతవరంలో అంబేద్కర్ విగ్రహాన్ని అవమానపరిచిన ఘటనపై ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకుల డిమాండ్

రామచంద్రపురం నియోజకవర్గం కె.గంగవరం మండలంలోని ఎర్ర పోతవరం గ్రామం వద్ద అంబేద్కర్ విగ్రహానికి చెప్పులు దండలు వేసి అవమానించిన దోషులను వెంటనే శిక్షించాలని ప్రజా ప్రతినిధులు, వివిధసంఘాల నాయకులు ఆదివారం డిమాండ్ చేశారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

రామచంద్రపురం: అంబేద్కర్ విగ్రహానికి చెప్పులు దండలు వేసి అవమానించిన సంఘటనపై రామచంద్రపురం ఎంఎల్ఎ వాసంశెట్టి సుభాష్ స్పందించారు. ఆయన ఆదివారం సాయంత్రం విగ్రహం వద్దకు వచ్చి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన దళితులతో మాట్లాడుతూ అంబేద్కర్ విగ్రహాన్ని అవమానించిన వారు ఎవరైనా ఎంతటి వారైనా ఏ పార్టీ వారైనా ఊరుకునేది లేదని 24 గంటల్లో నిందితులను అరెస్టు చేయాలని పోలీసులకు తెలియజేశామని ఆయన తెలిపారు. ఇటువంటి సంఘటన పునరావతం కాకుండా పోలీసులు చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా ఎంఎల్ఎ సూచించారు. ఆయన వెంట పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. అంబేద్కర్ విగ్రహానికి చెప్పులు దండ చేసిన దుండగులను 24 గంటల్లో అరెస్ట్ చేయాలని, కఠినంగా శిక్షించాలని పిడిఎస్‌యు, పివైఎల్, ఎఐకెఎంఎస్ ప్రజా సంఘాలు డిమాండ్ చేశారు. పిడిఎస్‌యు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నాయకులు బి.సిద్ధు, పివైఎల్ జిల్లా నాయకులు వి.భీమ శంకరం మాట్లాడుతూ బ అంబేద్కర్ విగ్రహానికి చెప్పులు దండ వేయడం సిగ్గుచేటు అన్నారు. ఈ ఘటనకు కారకులైన వారిని పోలీసులు అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కొందరు దుండగులు రాజకీయ కక్షలతో నియోజక వర్గంలో అంబేద్కర్ విగ్రహాలపై దాడులు చేయడానికి, చెప్పుల దండలు వేసి కులాలను రెచ్చగొట్టడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అంబేద్కర్ విగ్రహాలకు రక్షణ కల్పించాలని నూతన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిందితులను పోలీసులు డాగ్ స్క్వాడ్ టీమ్ ద్వారా గుర్తించి 24 గంటల్లో అరెస్టు చేయాలని లేని పక్షంలో రామచంద్ర పురం నియోజక వర్గం లో పెద్ద ఎత్తున్న పోరాటం చేస్తామని హెచ్చరించారు. అంబేద్కర్ విగ్రహాలకు చెప్పులు వేయడం అవమానించడం ఇటువంటి సిగ్గుచేటు పనులకు పాల్పడుతున్న వారిని ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని నియోజకవర్గ బిసి సేన అధ్యక్షులు యాట్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. పోలీసులు నిందితులను వెంటనే అరెస్టు చేసి శాంతి భద్రతలనుకాపాడాలి అని ఆయన విజ్ఞప్తి చేశారు. అంబేద్కర్ విగ్రహానికి చెప్పుల దండలు వేయడం పిరికిపందల చర్య అని బిఎస్‌పి జిల్లా నాయకులు మాత సుబ్రమణ్యం అలియాస్ సుబ్బు బాయ్ అన్నారు. ఆయన ఎర్ర పోతవరం సంఘటనా స్థలంలో విగ్రహం వద్దకు వచ్చి దళితులకు సంఘీభావం ప్రకటించారు. అనంతరం పోలీసులతో మాట్లాడి వారం రోజుల్లో సమస్య పరిష్కారం కాకుంటే తామే పరిష్కరించుకుంటామని, దీనిపై పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. **రాజోలు :** అంబేస్కర్ విగ్రహాన్ని అవమానపర్చిన దోషులను వెంటనే అరెస్ట్ చేయ్యాలని దళిత చైతన్య వేదిక నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు రాజోలు మండలం రాజోలు అంబేద్కర్ సామాజిక భవనం ఆవరణలో ఆదివారం దళిత చైతన్య వేదిక నాయకుల సమావేశం దళిత చైతన్య వేదిక వ్యవస్థాపకుడు బత్తుల మురళీకష్ణ అధ్యక్షతన జరిగింది. నాయకులు మాట్లాడుతూ అంబేర్కర్ విగ్రహన్ని అవమాన పరచిన సంఘటనలో పోలీస్ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి లోతుగా దర్యాప్తు చేపట్టి దోషులను వెంటనే అరెస్ట్ చేయాలన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావతం కాకుండా పార్టీలకు అతీతంగా అన్ని రాజకీయ పార్టీల నాయకులు స్పందించాలని, పోలీస్ అధికారులు పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పిడిఎం రాష్ట్ర నాయకులు దీపాటి శివప్రసాద్, దళిత చైతన్య వేదిక నాయకులు బత్తుల జనార్ధనారావు, చిలకపాటి శ్రీధర్, చుట్టుగుళ్ళ సత్యనారాయణ, మందపాటి మధు, కాకర విశ్వనాథం, గోగి మోహన్, పొన్నమాటి భాస్కర్, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ బుడితి గోపాలకృష్ణ, యెల్లమెల్లి రామకృష్ణ, పాస్టర్ తెన్నేటి బర్నబాస్ తదితరులు పాల్గొన్నారు.



పోలీసులతో మాట్లాడుతున్న బిఎస్‌పి నాయకులు సుబ్బు బాయ్



అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎంఎల్ఎ సుభాష్

ఎస్‌టియు ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-మామిడికుదురు

మామిడికుదురు ఎంఆర్‌సి కార్యాలయం వద్ద ఎస్‌టియు మండల శాఖ ఆధ్వర్యంలో మండల శాఖ అధ్యక్షులు కారుపల్లి కళ్యాణ్ బాబు అధ్యక్షతన ఆదివారం ఎస్‌టియు 78వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎస్‌టియు రాష్ట్ర కౌన్సిలర్ మట్టా నాగరాజు ఎస్‌టియు పతకాన్ని ఆవిష్కరించారు. సంఘ సభ్యులు అందరూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎంఇఒ-2 శ్రీ మోకా వెంకన్నబాబు, మండల అభయ్ కన్వీనర్ ఉండ్రు శ్రీ రమణ, సి పిఎస్ కన్వీనర్ నేల వెంకటేశ్వరరావు, కారుపల్లి సత్యనారాయణ, జల్లి కోటేశ్వరరావు, సయ్యద్ రూహి, తిరుమల బాల బాలాజీ, మానుపాటి మునీశ్వరరావు, అడబాల సూర్యనారాయణ, తదితర సంఘ సభ్యులు పాల్గొన్నారు.



దాతకు స్వామి వారి చిత్రపటం అందిసున్న ఆలయ సహాయ కమిషనర్

నిత్యాన్నదానానికి విరాళాల అందజేత


ప్రజాశక్తి -మామిడికుదురు

అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ స్వామి శాశ్వత నిత్యాన్నదానట్రస్ట్‌కు పలువురు దాతలు ఆదివారం విరాళాలు అందజేశారు. పి.గన్నవరం వాసులు బోడపాటి శివ కష్ణప్రసాద్ జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు పద్మనాభం, సీతారత్నం దంపతులు ప్రతీ ఏటా విజయదశమి రోజున అన్నదానం జరిపించేందుకు రూ.1,00,116 విరాళం గా ఇచ్చారని ఆలయ సహాయ కమిషనర్ గ్రంధి మాధవి తెలిపారు. నరసాపురానికి చెందిన తిరుమానిజయలక్ష్మి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు విజయ సారధి ప్రతి ఏటా డిసెంబర్ 30 న అన్నదానము జరిపించు నిమిత్తం రూ.10,000 విరాళంగా ఇచ్చారనితెలిపారు ఆలయ అర్చకులు మరియు ఆలయ సిబ్బంది దాతకు స్వామివారి చిత్రపటం, లడ్డు ప్రసాదంలు అందజేశారన్నారు

వెండి శంఖం బహూకరణ

పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండ మండలం తామరాడకు చెందిన కానూరి బాలాజీ శ్రీనివాస్ కనక దుర్గ వెంకట లక్ష్మి దంపతులు భక్తులకు శంఖంతో తీర్థం ఇచ్చు నిమిత్తము (సుమారు రూ.40,000) 400 గ్రాములు వెండి శంఖం శ్రీ బాల బాలాజీ స్వామికి బహూకరించి నట్లు ఆలయ సహాయ కమిషనర్ తెలిపారు. ఆలయ అర్చకులు సంప్రోక్షణ చేసిన అనంతరం బహూకరించారు. వారికి ఆలయ అర్చకులు, సిబ్బంది శ్రీ స్వామి వారి చిత్ర పటం, లడ్డు ప్రసాదములు అందజేశారన్నారు

కార్టూ'నిజం'



'శ్రీ సాయి' స్కూల్లో క్రమశిక్షణతో కూడిన విద్య

ప్రజాశక్తి -ఐ.పోలవరం

మండలంలోని మురమళ్లలో 35ఏళ్ల క్రితం స్థాపించిన శ్రీ సాయి స్కూల్ నాణ్యమైన విద్యకు చిరునామాగా మారిందని పాఠశాల కరస్పాండెంట్ పెన్మెత్స వాసు రాజు, ప్రిన్సిపల్ సిహెచ్.సతీష్ 'ప్రజాశక్తి' కి వివరించారు.1989లో 40 మంది విద్యార్థులతో అద్దె భవనంలోకి ప్రారంభించిన శ్రీ సాయి పాఠశాల నేడు 500మందికి పైగా విద్యార్థులతో సువిశాలమైన తరగతి గదులు కలిగిన సొంత భవనంలోకి మారే స్థితికి ఎదిగిందన్నారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో పటిష్టమైన ప్రణాళికను అనుసరిస్తూ విద్యార్థిని, విద్యార్థులను అత్యున్నత స్థాయికి చేర్చడమే లక్ష్యంగా విద్యా ప్రమాణాలతో నడపబడుచున్న ఏకైక విద్యా సంస్థ అని చెప్పారు. మేము అతి తక్కువ ఫీజులతో ప్రాథమిక స్థాయినుండి చిన్నారులకు అన్ని కాంపిటేటివ్ పరీక్షలకు ఉపయోగపడేలా క్వాలిటీ విద్య నందిస్తున్నామన్నారు. విద్యార్థులను ఇంజినీర్లు, డాక్టర్లు, శాస్త్రవేత్తలు, ప్రభుత్వ అధికారులుగా తీర్చిదిద్దామన్నారు. బఠదే ఒరవడితో విద్యాబోధనను కొనసాగిస్తూ ప్రతి విద్యార్థి పైనా ప్రత్యేక శ్రద్ధ కనబరిచి విద్యాబోధనను అందిస్తున్నామని తెలిపారు.2024-



పదవతరగతి పబ్లిక్ పరీక్షల్లో 33 మంది విద్యార్థులు హాజరుకాగా



శ్రీసాయి స్కూల్

32మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించారు. మండల స్థాయిలో ఎస్.దేవి 583/600, ఎం.శిరి 582, కె.చక్రవర్తి 570, బి.జయశ్రీ 570 మార్కులు సాధించారు.



వివిధ వేషధారణల్లో విద్యార్థులు

స్కూల్ ప్రత్యేకతలు

1. అనుభవజ్ఞులు, నిష్ణాతులు అయిన ఉపాధ్యాయులచే విద్యాబోధన.
2. ప్రతి తరగతిలో ఆడియో విజువల్ ప్రోగ్రామ్ ద్వారా డిజిటల్ బోర్డుపై విద్యా బోధన.
3. చదువులో వెనుకబడిన విద్యారులకు ప్రత్యేక శ్రద్ధ
4. 3వ తరగతి నుండి స్పోకెన్ ఇంగ్లిషు, జనరల్ నాలెడ్జ్ మరియు కమ్యూనికేషన్స్ స్కిల్స్ పై ప్రత్యేక శిక్షణ.
5. నర్సరీ, ఎల్‌కెజి, యుకెజి విద్యార్థులకు ఆటపాటలతో విద్యాబోధన.
6. ఎన్‌సిసి, డ్రాయింగ్, సంగీతం, క్లాసికల్ డ్యాన్స్, కరాటేలతో ప్రత్యేక శిక్షణ.
7. అన్ని వసతులతో కూడిన విశాలమైన ఆటస్థలం,క్రీడలపై ప్రత్యేక శ్రద్ధ.
8. ప్రి ప్రయిమరీ విద్యార్థులకు ఇండోర్ గేమ్స్,స్లీపింగ్ హావర్స్ సౌకర్యం.
9. సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కొరకు పండుగ వేడుకలు.
10. విద్యార్థుల తల్లి దండ్రులకు ప్రతి నెల పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ నిర్వహించుట.
11. విద్యార్థుల ప్రతిభను వారి తల్లిదండ్రులకు ప్రోగ్రెస్ రిపోర్టు ద్వారా తెలియజేయుట.
12. విద్యార్థులలో విజ్ఞానం పెంపొందించటానికి గ్రంథాలయం, సైన్స్‌లో అవగాహన కొరకు ప్రయోగశాల సౌకర్యం కల్పించుట.
13. అత్యాధునిక కంప్యూటర్ ల్యాబ్, ప్రతి విద్యార్థికి వ్యక్తిగత కంప్యూటర్ శిక్షణ.
14. ప్రతి క్లాస్ రూమ్ కి రెండు ఫ్యాన్‌లు, 26 విశాలమైన స్లాబ్ తో నిర్మించబడిన టాయ్ లెట్స్.
15. ప్రతి బ్లాక్ కు మినరల్ వాటర్ సదుపాయం కలదు.
16. అన్ని గ్రామాల నుండి బస్సు, ఆటో సదుపాయం కలదు.
17. హ్యాండ్ రైటింగ్ స్కిల్స్ పెంచుటకు 1వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ప్రత్యేక శ్రద్ధ
18. స్కూల్ కి హాజరుకాని విద్యార్థుల వివరాలను ఫోన్స్ కాల్స్ ద్వారా వారి తల్లిదండ్రులను అదే రోజు అడిగి తెలుసుకొనుట.
19. ఐపిఎం:(ఎడ్యుకేషన్ ప్రొఫైల్-3)

నేరాలు ఘోరాలు



సీజ్ చేసిన బియ్యం లారీతో అధికారులు, సిబ్బంది

రేషన్ బియ్యం లారీ పట్టివేత

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని జొన్నాడ, ఆలమూరు రోడ్డులో అక్రమంగా పిడిఎస్(రేషన్ బియ్యం) రవాణా చేస్తున్న లారీని విజిలెన్స్ అధికారులు, రెవెన్యూ, సివిల్ సప్లయ్స్ అధికారులు సంయుక్తంగా ఆదివారం దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. ఈ లారీని తనిఖీ చేయగా వాహనంలో 480 బస్తాల్లో సుమారు 23,500 కేజీల పిడిఎస్ బియ్యాన్ని గుర్తించారు. పిడిఎస్ బియ్యంను కాకినాడ నగర పరిధిలోని జగన్నాధపురానికి చెందిన ఎస్.నరసింహమూర్తి లారీలో భీమవరం జిల్లా పాలకోడేరు మండలంలోని శృంగవక్షంకు చెందిన కనక దుర్గా రైస్ ట్రేడర్స్ నుంచి కాకినాడ లవన్ ఇంటర్నేషనల్‌కు రవాణా చేస్తున్నారు. సుమారు రూ.18,69,250 విలువ గల 23,500 కేజీల పిడిఎస్ బియ్యాన్ని, వాహనాన్ని మండల సివిల్ సప్లయ్స్ అధికారులు సీజ్ చేసి 6-ఎ క్రింద కేసు నమోదు చేశారు. అక్రమ రవాణా చేయుచున్న సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు కొరకు స్థానిక పోలీసు స్టేషన్ కు సిఫారసు చేశారు. ఈ సందర్భంగా రీజనల్ విజిలెన్స్ ఎస్‌పి కెఎస్ఎస్‌వి. సుబ్బారెడ్డి మాట్లాడుతూ రాజమహేంద్రవరం రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ పరిధిలోని మూడు జిల్లాలలో పిడిఎస్ అక్రమ నిల్వలు, అక్రమ రవాణాపై నిరంతరం నిఘా కొనసాగుతుందన్నారు. ఎవ్వరైనా పిడిఎస్ కొనడం, అమ్మడం చేస్తే సదరు వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీలలో విజిలెన్స్ అధికారులు జగన్నాధరెడ్డి, వలి, కిషోర్, సిఎస్‌డిటి అలీషా, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

46 మద్యం సీసాల స్వాధీనం

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని సుంకరపాలెం గ్రామంలో ఎక్సైజ్ చెక్‌పోస్ట్ వద్ద చేసిన తనిఖీల్లో ద్విచక్రవాహనంపై తరలిస్తున్న 46 మద్యం సీసాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ రామస్వామి ఆధ్వర్యంలో ఆదివారం తనిఖీలు నిర్వహిస్తుండగా చొల్లంగి వెంకటరమణ అనే వ్యక్తి ద్విచక్రవాహనాన్ని తనిఖీ చేశారు. దీంతో అతని నుంచి 46 మద్యం సీసాలతోపాటు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకుని తాళ్ళరేవు స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ రామస్వామి తెలిపారు. ఈ తనిఖీల్లో కానిస్టేబుల్స్ రాజు, రామకృష్ణ, అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

అపస్మారక స్థితిలో ఉన్న మహిళ ఆసుపత్రికి తరలింపు

ప్రజాశక్తి - కరప



పెనుగుదురు గ్రామంలో బస్ స్టాండు సెంటర్‌లో అపస్మారక స్థితిలో ఉన్న మహిళను పోలీసులు కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గుర్తు తెలియని మహిళ రావులపాలెం బస్టాండ్‌లో బస్సు ఎక్కి పెనుగుదురు సెంటర్లో బస్సు నుంచి దిగుతూ కింద పడిపోయింది. ఆ బస్సులో ఉన్న వారు చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో తరలించారు. ప్రస్తుత ఆ మహిళ వివరాలు ఏమీ తెలియలేదని, ఫోటో లో ఉన్న ఆమె వివరాలు తెలిస్తే 9440796557 నెం బర్‌కు సమాచారం అందించాలని ఎస్ఐ టి.రామకృష్ణ కోరారు.

జెసిబి, మూడు ట్రాక్టర్లు సీజ్

ప్రజాశక్తి-గోపాలపురం

ఎటువంటి అనుమతులు లేకుండా చెరువులు, కాలువలోఓల అక్రమంగా మట్టి తవ్వకాలు జరిపితే చర్యలు తప్పవని ఎస్ఐ కె.సతీష్ కుమార్ హెచ్చరించారు. ఆదివారం మండలంలోని రాంపాలెంలో జల వనరుల శాఖకు చెందిన బాలంకి చెరువులో అక్రమంగా మట్టిని తవ్వి, రవాణా చేస్తున్నట్టు వచ్చిన సమాచారంపై ఒక జెసిబి, మూడు ట్రాక్టర్లను ట్రక్కులతో సహా సీజ్ చేసి పోలీస్ స్టేషన్ తరలించినట్టు ఎస్ఐ సతీష్ కుమార్ తెలిపారు.

పుట్టగొడుగుల్లా అక్రమ లే అవుట్లు

-ప్రభుత్వ ఆదాయానికి గండి
-పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

మండలంలో ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా ప్రయివేటు లే-అవుట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. పంట పొలాలను ఇళ్ల స్థలాలుగా మార్చాలంటే కన్వర్షన్ తప్పనిసరిగా ఉండాలి. అయితే కన్వర్షన్ జరగకుండానే అడ్డదారుల్లో లే అవుట్లను వేసి విక్రయాలను చేపడుతున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి పెద్దఎత్తున గండి పడుతోంది. అయినా సంబంధిత అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడంపై వెనుక ముడుపులే కారణమనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

మండలంలోని పొన్నాడ, మూలపేట, గోర్స, కొమరగిరి, అమీనాబాద్ తదితర గ్రామాల్లో అనుమతి లేని లేఅవుట్లు వెలుస్తున్నాయి. ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకున్నా ఏర్పాటు చేస్తున్న లే అవుట్‌లలో మౌలిక సదుపాయాల పనులు చేపడుతున్నారు. ఈ పనులన్నీ ప్రభుత్వ నిబంధనలకు తిలోదకాలు పలిక జరుగుతున్నాయంటే ఏ స్థాయిలో అధికారులకు అమ్యామ్యాలు అందుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. ఈ లే అవుట్లకు ప్రభుత్వ అనుమతులు ఉన్నాయా? లేవా? అనే దానిపై అవగాహన లేని కొనుగోలుదారులు చేతులు కాలాకా ఆకులు పట్టుకున్నట్లు ఆ లే అవుట్లను కొనుగోలు చేసి విషయం తెలిసిన తరువాత లబోదిబోమంటున్నారు. ప్రభుత్వ అనుమతి లేని లే అవుట్‌లో గృహాలు నిర్మించుకోవాలంటే కొనుగోలుదారులే అదనంగా సొమ్ములు వెచ్చించి బెటర్‌మెంటు చార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. అక్రమ లేఅవుట్‌లు ఏర్పాటు చేస్తున్నప్పుడు చర్యలు తీసుకోవాల్సిన అధికారులు వారిపై చర్యలు తీసుకోకుండా రాజకీయ వత్తిళ్లతో వారు చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. లే అవుట్‌లో అప్పుచేసి లక్షలాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన స్థలాల్లో ఇల్లు నిర్మించుకోవాలంటే పంచాయితీకి చెల్లించాల్సిన సొమ్ము చెల్లించాలని అధికారులు మాత్రం ఆదేశాలు జారీ చేస్తున్నారు. మండలంలోని పొన్నాడ, మూలపేటలో ఏర్పాటులో చేసిన అనుమతి లేకుండా అక్రమంగా ఏర్పాటు చేసిన లే అవుట్‌లపై పొన్నాడ గ్రామ కార్యదర్శి వివరణ కోరగా లే అవుట్‌లకు ఏటువంటి అనుమతులు లేవని తెలిపారు. ఇప్పటికే ఏర్పాటు దారులకు నోటీసులు పంపామని, అలాగే వుడా (వైజాగ్ అర్బన్ డెవలప్ అథారిటీస్)కు సమాచారం అందించామన్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి అక్రమంగా ఏర్పాటు చేస్తున్న లే అవుట్లపై చర్యలు తీసుకుని ప్రభుత్వ ఆదాయాన్ని కాపాడటంతోపాటు, కొనుగోలుదారులకు అవగాహన కల్పించేలా దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.



పొన్నాడ గ్రామంలో అనుమతి లేకుండా వేస్తున్న లే అవుట్



మూలపేట గ్రామంలో అనుమతి లేకుండా వేస్తున్న లే అవుట్

దిగజారుతున్న పారిశుధ్యం

-పందుల స్వైరవిహారం
-ఆందోళనలో పట్టణ ప్రజలు

ప్రజాశక్తి - ఏలేశ్వరం

మండల కేంద్రమైన ఏలేశ్వరం నగర పంచాయతీలో పారిశుధ్యం దిగజారుతోంది. పట్టణంలో ఎక్కడ చూసినా పందులు స్వైర విహారం చేస్తున్నాయి. పందులను రోడ్లపైకి వదిలితే కఠిన చర్యలు తీసుకుంటామన్నా హెచ్చరికలను సంబంధిత పందుల యజమానులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అధికారులు హెచ్చరికలు జారీ చేసినప్పుడు ఒకటి, రెండు రోజులపాటు పందులను కట్టివేస్తున్నారని, తరువాత యథావిధిగా వదిలివేస్తున్నారు. దీంతో పందులు పట్టణంలో స్వైరవిహారం చేస్తున్నాయి. ఈ పందుల వల్ల అంటు వ్యాధులు ప్రభల్లే అవకాశాలు ఉన్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీటికితోడు ఎక్కడ చెత్త అక్కడే పేరుకుపోవడం, డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్థంగా ఉండటంతో మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోంది. పట్టణంలో నూతన డ్రెయినేజీలు నిర్మాణం చేపట్టకపోవడం పాత డ్రెయినేజ్‌లు శిధిలావ్యవస్థకు చేరడంతో వర్షాలు పడితే నీరు ఎక్కడపడితే అక్కడే నిలిచిపోయే పరిస్థితులు నెలకున్నాయి. రానున్న వర్షాకాలంలో మలేరియా, టైఫాయిడ్, డెంగూ, వంటి అంటు వ్యాధులు ప్రభలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. నగర పంచాయతీ అధికారులు ఇప్పటికైనా పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, అలాగే పందులు పట్టణంలోకి రాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



పేరుకుపోయిన చెత్తలో పందులు

యానాం వార్తలు

బిఎస్‌సి నర్సింగ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - యానాం

బిఎస్‌సి నర్సింగ్ కోర్సుకు ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు నర్సింగ్ కౌన్సిల్ నిబంధనల ప్రకారం తిరిగి మళ్లీ సెంటాక్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. బిఎస్‌సి కోర్సులో ప్రవేశానికి ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహించాల్సి ఉందని, ప్రభుత్వ కోటా అడ్మిషన్ల ప్రక్రియ సెంటాక్ ద్వారా నిర్వహిస్తారన్నారు. కావున అభ్యర్థులు ఈ నెల 10వ తేదీ నుంచి కొత్తగా తమ దరఖాస్తులను సెంటాక్ వెబ్‌సైట్‌లో పంపాలన్నారు. ఇప్పటికే దరఖాస్తు చేసినవారు సైతం తిరిగి దరఖాస్తు చేసుకోవడం తప్పనిసరన్నారు. ఇందిరా గాంధీ మెడికల్ కాలేజీ, మదర్ థెరిస్సా నర్సింగ్ సెంటర్‌లలో నీట్ మార్కుల ఆధారంగా సీట్లు కేటాయిస్తున్నట్లు తెలిపారు.



గుర్తు తెలియని వ్యక్తులు చించేసిన ఫ్లెక్స్

జనసేన ఫ్లెక్సీ చించివేత

ప్రజాశక్తి - పిఠాపురం

పట్టణంలోని పాదగయ సమీపంలో జాతీయ రహదారిపై జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్, ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ ఫొటోలతో కూడిన ఫ్లెక్స్‌ని ఆదివారం గుర్తు తెలియని వ్యక్తులు చించేశారు. దీనిపై జనసేన నాయకులు ఎం.శ్రీను, బి.సాయికుమార్, కె.అరవిందు ఫ్లెక్స్ చించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని, ఇటువంటి సంఘటనలు పున రావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఎన్‌డిఎ విజయంపై హర్షం

ప్రజాశక్తి - రౌతులపూడి

ఎన్‌డిఎ కూటమి విజయాన్ని హర్షిస్తూ టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. మండలంలోని లచ్చిరెడ్డిపాలెం, పారుపాక గ్రామాల్లో కూటమి నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి అభిమానులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ఉమ్మడి వెంకట్రావు, శ్రీను, ఎనుముల రాజా, కోసూరి కృష్ణవర్మ తదితరులు పాల్గొన్నారు.

హింసాత్మక ఘటనలకు స్వస్తి పలకాలి

ప్రజాశక్తి-కొవ్వూరు రూరల్

రాష్ట్రంలో హింసాత్మక సంఘటనలకు స్వస్తి పలకాలని లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బొంతా శ్యామ్ రవి ప్రకాష్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఎన్‌డిఎ కూటమి ప్రమాణస్వీకారం చేయకముందే విధ్వంసాలకు దిగడం అంబేద్కర్ శిలా ఫలకాలను ధ్వంసం చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. మహనీయుల విగ్రహాలు స్మృతివనాలు శిలాఫలకాల ధ్వంసం వంటి చర్యలు మానుకోకపోతే తగిన గుణపాఠం చెబుతామని ఆయన హెచ్చరించారు. పేర్లు మార్పు చెయ్యానుకుంటే న్యాయ బద్ధంగా మార్పు చేయవచ్చని, భయానక వాతావరణం సృష్టించి రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించడం మంచి పద్ధతి కాదని తెలిపారు.



ఆత్రేయపురంలో పనులు చేస్తున్న వేతనదారులు

ఉపాధి పనులకు అధికారుల పర్యవేక్షణ కరువు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ద్వారా చేస్తున్న పనులను క్షేత్ర స్థాయిలో అధికారుల పర్యవేక్షణ లేకుండా పోయింది. ఎపిఒ భారతి పనులు చేసే సమయంలో పర్యవేక్షించిన దాఖలాలు ఎక్కడా లేవని వేతనదారులే చెబుతున్నారు. పనులు చేసే సమయంలో వారికి కల్పించవలసిన కనీస సౌకర్యాలు కూడా కల్పించకపోగా వారి ఇబ్బందులు చెప్పుకోవాలంటే వినే నాథుడే కురువయ్యాడని వేతనదారులు చెబుతున్నారు. ఒకపక్క కొలతల ప్రకారం పనులు సక్రమంగా చేస్తున్న పూర్తి వేతనం రావట్లేదు అంటూ వేతన్దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు . వేసవి దష్ట్యా వారికి కల్పించవలసిన కనీస సౌకర్యాలు కూడా లేకపోవడంతో వేతనదారులు ఇబ్బందులు వర్ణనాతీతం. వేతనదారులు పనులు చేసే సమయంలో ఫీల్డ్ అసిస్టెంట్లు తప్ప మరి ఏ అధికారి పనులను పరిశీలించిన దాఖలాలు లేవు.

రూ.250పైబడి వేతనం అందట్లేదు

వేతనదారులు పనులు చేసే సమయంలో టెక్నికల్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఎపిఒ, క్లస్టర్ ఎపిడి పనులను పరిశీలించి వారికి పూర్తి వేతనం మూడు వందల ఇరవై రూపాయలు అందేలా చూడాలి. కానీ. రెండు వందల యాభై రూపాయలు పైబడి రావట్లేదు అంటూ వేతనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు కలగచేసుకుని వేతనదారులకు పూర్తి వేతనం వచ్చేలా పనులు కల్పించాలని పలువురు కోరుకుంటున్నారు.



ఇటీవల కురిసిన వర్షానికి పాశర్లపూడిలో రహదారిపై గోతుల్లో చేరిన మురుగునీరు

ప్రమాదకరంగా రహదారిపై గోతులు

- వాహనచోదకులకు తప్పని ఇబ్బందులు
- మురుగునీరు మళ్లించేలా చర్యలు తీసుకోవాలని వినతి


ప్రజాశక్తి- మామిడికుదురు

మండలంలోని పాశర్లపూడి అమ్మ సూపర్ మార్కెట్ నుండి కైకాల పేట వరకు కిలోమీటర్ వరకు 216వ జాతీయ రహదారి లో నాలుగు చోట్ల ఏర్పడిన గోతులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఇటీవల కురిసిన కొద్దిపాటి వర్షానికి గోతుల్లో నీరు చేరడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సఖినేటిపల్లి, మలికిపురం, రాజోలు, మామిడికుదురు మండలాల వాసులే కాకుండా పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు, భీమవరం నుంచి వచ్చే వాహనాల రాకపోకలతో ఈ రహదారిపై గోతులు, మురుగు నీరు నిలువతో అధ్వానంగా మారింది. దీంతో వాహనచోదకులకు అవస్థలు తప్పడంలేదు. ఇదే రహదారిలో మామిడికుదురులో రెండు చోట్ల రోజుల తరబడి మురుగు నీరు తిష్ట వేయడంతో వాహన చోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారులు రోడ్డుపై తిష్ట వేసిన మురుగనీరు మళ్లించేలా చర్యలు చేపట్టాలని వాహనచోదకులు కోరుతున్నారు.

ప్రమాణ స్వీకార పూజలో ఎంఎల్ఎ వేగుళ్ల

ప్రజాశక్తి-మండపేట

టిడిపి అధినేత చంద్రబాబు 4వసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారోత్సవానికి సర్వం సిద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆయన ప్రమాణ స్వీకారం చేయనున్న కృష్ణా జిల్లా, గన్నవరం మండలం, కేసరపల్లి సభా స్థలిలో రాజానగరం మాజీ ఎంఎల్ఎ పెందుర్తి వెంకటేష్ ఆదివారం భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో మండపేట ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు పాల్గొన్నారు.



దుర్గేష్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కుందుల సత్యనారాయణ

ఎంఎల్ఎ దుర్గేష్‌ను కలిసిన 'కుందుల'

ప్రజాశక్తి-పెరవలి

నిడదవోలు నియోజకవర్గంలో భారీ మెజారిటీతో ఘన విజయం సాధించిన జనసేన పార్టీ, కూటమి బలపరిచిన అభ్యర్థి, ఎంఎల్ఎ కందుల దుర్గేష్‌ను ఆదివారం టిడిపి సీనియర్ నాయకులు కుందుల వీర వెంకట సత్యనారాయణ అభినందించారు. ఆయన వెంట, నిడదవోలు పట్టణ మాజీ టిడిపి అధ్యక్షుడు గూడపాటి వెంకట్రావు, టిడిపి పోలవరం నియోజకవర్గఅబ్జర్వర్ అనపర్తి వెంకట నారాయణ పాల్గొన్నారు

ఓణీల వేడుకలో ఎంఎల్ఎ దుర్గేష్


ముక్కామల గ్రామంలో వేంద్ర వెంకటేశ్వరరావు మనవరాలు ఓణీల వేడుక ఫంక్షన్‌లో ఎంఎల్ఎ కందుల దుర్గేష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నల్ల సురేంద్ర, వీరేష్ బాబు, వేంద్ర బాలాజీ, వేంద్ర వెంకటరమణమూర్తి నాయకులు పాల్గొన్నారు.

రామోజీరావుకు ఘన నివాళి

ప్రజాశక్తి-యంత్రాంగం

ప్రముఖ వ్యాపార వేత్త, రామోజీ గ్రూపు సంస్థల అధినేత చెరుకూరి రామోజీరావుకి మృతికి పలువురు సంతాపం తెలిపారు. రామోజీరావు అనారోగ్యంతో ఈ నెల 8న మృతి చెందారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

అమలాపురం రూరల్ : రామోజీరావుకి నా చిత్ర నివాళి అంటూ అమలాపురానికి చెందిన చిత్రకారుడు పోలిశెట్టి నరసింహ చంద్రకుమార్ వాటర్ కలర్స్ ఉపయోగించి ఆదివారం రామోజీ చిత్రాన్ని పెయింటింగ్ వేశారు. ఈ చిత్రం పలువురిని ఆకట్టుకుంది. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ రామోజీరావు స్థాపించిన రామోజీ గ్రూప్ ఆధీనంలో ప్రపంచంలోనే అతిపెద్ద సినిమా స్టూడియో రామోజీ ఫిలిం సిటీ ఉందన్నారు. **కాట్రేనికోన:** రామోజీరావు మృతి రాష్ట్రానికి, మీడియా రంగానికి తీరని లోటు అని టిడిపి రాష్ట్ర కార్యదర్శి, మాజీ జెడ్‌పిటిసి సభ్యులు నాగిడి నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనాడు సంస్థల అధినేత చెరుకూరి రామోజీరావు మృతి తెలుగు ప్రజలకు తీరని లోటని ఆయన అన్నారు. కార్యక్రమంలో కముజు లక్ష్మీ రమణారావు, విత్తనాల బుజ్జి , వాసంశెట్టి రాజేశ్వర రావు, రాష్ట్ర ఎస్‌సి సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సత్తాల ప్రసాద్, మోకా అప్పాజీ, మండల మహిళా అధ్యక్షురాలు మాదే యోగేశ్వరి, ఎం.సత్యనారాయణ మూర్తి తది తరులు పాల్గొన్నారు. **రావులపాలెం:** రామోజీరావు ఆకస్మిక మృతికి చింతిస్తూ ఆదివారం సాయంత్రం స్థానిక చాంబర్ ఆఫ్ కామర్స్ భవనం నందు ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్) ఆధ్వర్యంలోకొత్తపేట నియోజకవర్గ పాత్రికేయులు, నియోజకవర్గ ఎపిడబ్ల్యుజెఎఫ్ కమిటీ సభ్యులు తదితరులు రాజమోజీరావు చిత్రపటానికి నివాళులార్పంచారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు పి.బంగారు రాజు ,నియోజకవర్గ అధ్యక్షులు వాకాడ బాబులు, సెక్రటరీ పి.చంటి, ఉపాధ్యక్షులు డి.గనిరాజు, ట్రెజరర్ యు.సురేష్, కార్యవర్గ సభ్యులు కెవివి.సత్యనారాయణ, పి.రాజు, కనికిరెడ్డి, ఎన్.నాని ,ఎన్ శ్రీను, ఎన్ రమేష్ , బి.పెద్దిరాజు, మూర్తి తదితరులు పాల్గొన్నారు. **మామిడికుదురు:** రామోజీరావు మృతి తీరని లోటని పలువురు వక్తలు పేర్కొన్నారు. మామిడికుదురు ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం రామోజీరావు కి నివాళులు అర్పించారు. ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలుగు పత్రికా రంగంలో ఎనలేని కృషి చేసి తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకొన్న రామోజీరావు మృతి పట్ల దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నయినాల సత్య దుర్గా ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ అమీర్ హాసన్, కోశాధికారి ఏడిద బాలకృష్ణారావు, జాయింట్ సెక్రటరీ గుబ్బల హరిబాబు, సభ్యులు కడియం త్రినాథ స్వామి, తోరం సత్యనారాయణ, ఏడిద లోకేష్, స్థానికులు నయినాల సత్యమూర్తి తదితరులు పాల్గొన్నారు.



రామోజీరావు చిత్రపటం



కాట్రేనికోనలో రామోజీ చిత్రపటం వద్ద పలువురు నివాళి

కక్షసాధింపు చర్యలే వైసిపి అజెండా

ప్రజాశక్తి-కొత్తపేట

దాడులు, విధ్వంసం, కక్ష సాధింపు చర్యలు వైసిపి నేతలు అజండా అని టిడిపి అధికార ప్రతినిధి ముత్యాల బాబ్జి విమర్శించారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ బాధ్యత గల ప్రతిపక్షంగా వైసిపి నేతలు సూచనలు చేస్తే టిడిపి స్వీకరిస్తుందన్నారు. గత ఐదేళ్లుగా కొత్తపేట నియోజకవర్గంలో జరిగిన పాలనా తీరు భావితరాలకు కనువిప్పు కావాలని వాడపల్లి వెంకన్నఆలయ అభివృద్ధికి శ్రీకారం చుట్టింది, యాత్రికులను ఆకట్టుకునే కార్యక్రమాలు చేపట్టింది బండారు సత్యానందరావు గుర్తు చేశారు. వాడపల్లి ఆలయంలో యాత్రికుల సౌకర్యార్థం అన్నదాన భవనం గాని, కళ్యాణ మండపం కొరకు స్థల సేకరణ చేసింది అప్పటి పాలకవర్గమేనని అన్నారు. బైపాస్ రోడ్డు నిర్మించింది టిడిపి ప్రభుత్వంలో హయాంలోనేని అన్నారు. ఈ ఐదేళ్లలో మీరేం చేశారో అందరికీ తెలిసిన విషయమేనని అన్నారు. నియోజకవర్గంలో సమస్యల పరిష్కారంతోపాటు, అభివృద్ధిని ముందుకు తీసుకు వెళ్ళడంలో చంద్రబాబు సారథ్యంలో సత్యానందరావు విజయవంతంగా పని చేస్తారని అన్నారు.